# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, సోమవారం 16 డిసెంబర్ 2024 | HYDERABAD




## న్యూ ఇయర్ వేడుకలపై ఫోకస్

### పాత డ్రగ్ పెడ్లర్స్ కదలికలపై పోలీసుల నిఘా

సిటీబ్యూరో: న్యూ ఇయర్ వేడుకలు అనగానే గుర్తుకొచ్చేది పబ్బులు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించే గ్రౌండ్స్, హోటల్స్, ఇతర ప్రాంతాలు. అర్ధ రాత్రి వరకు మద్యం మత్తులో చాలా మంది యువత చిందులేస్తుంటారు. దీనినే ఆసరాగా చేసుకుంటూ డ్రగ్స్ ముఠాలు ఆయా పబ్‌లు, హోటళ్లలో డ్రగ్స్‌ను విక్రయిస్తుంటారు. ప్రతి ఏటా న్యూ ఇయర్ వేడుకల్లో ఈ డ్రగ్స్ ముఠాలు పట్టుబడుతూ ఉంటాయి. అయినా కూడా తమ రూట్‌ను మారుస్తూ ఈ వేడుకలను తమ వ్యాపారానికి అనుకూలమైన సమయంగా భావిస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే పోలీసులు కూడా న్యూ ఇయర్ వేడుకలపై ఫోకస్ పెట్టారు. ఇప్పటికే కొత్త సంవత్సరం సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేశారు. డ్రగ్స్ విక్రయాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలంటూ సూచనలు చేశారు. పాత నేరస్తులపై నిఘా పెట్టారు.



సికింద్రాబాద్ పీజీ కళాశాల వద్ద గ్రూప్-2 అభ్యర్థుల ధ్రువీకరణపత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది



జోరుగా ఆన్‌లైన్ బెట్టింగ్స్

# ఆన్‌లైన్ జూదం.. జీవితాలు ఛిద్రం

అమాయకులకు వేలవేసి.. కోట్ల వ్యాపారం

రాష్ట్రంలో నిషేధమున్నా.. చెలరేగిపోతున్న నిర్వాహకులు

మార్కెటింగ్ చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్

గ్యాంబ్లింగ్‌లో కూరుకుపోయి.. యువత బలవన్మరణం

సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్ జూదం.. యువత జీవితాలను ఛిద్రం చేస్తోంది.. జూదంలో కూరుకుపోయి.. యువత బలవన్మరణానికి పాల్పడుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు జోరు సాగుతున్నాయి. దీనికి సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ కూడా కొందరు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డ చాలా మంది యువత తల్లి దండ్రులు కష్టపడి సంపాదించిన సొమ్మును ఆన్‌లైన్ బెట్టింగ్ రాయుళ్ల ఖాతాలకు పంపిస్తున్నారు. అక్రమ పద్ధతిలో నడుస్తున్న ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లలో నిర్వాహకులు ఏఐ సహకారాన్ని తీసుకుంటూ కోట్ల రూపాయల వ్యాపారాన్ని చేస్తున్నారు. అమాయకులకు వల వేసి భారీగా సంపాదిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులు ఈ గేమ్స్‌ను ప్రమోట్ చేయడానికి ఆన్‌లైన్ కూడా భారీగానే వెచ్చిస్తున్నారు. రమ్మీ వంటి ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారు ఆ షాక్ నుంచి కోలుకోక, బయట ముఖం చూపించలేక బలవన్మరణాలకు పాల్పడ్డ ఘటనలు రాష్ట్రం వ్యాప్తంగా తరచూ చోటు చేసుకుంటున్నాయి.

### జిమ్మిక్కులు చేస్తూ...

ఆన్‌లైన్ రమ్మీ, ఇతర గ్యాంబ్లింగ్ ఆటలోకి కస్టమర్లను ఆకర్షించేందుకు వివిధ వెబ్‌సైట్లు ఇంటర్‌నెట్‌లో భారీ ప్రకటనలిస్తుంటాయి. దానికి తోడు మా వెబ్‌సైట్లో సభ్యత్వం తీసుకుంటే బంపర్ ఆఫరిస్తామంటూ బుట్టలో పడేస్తున్నారు. ఆట ప్రారంభంలో డబ్బులు ఇచ్చినట్లే చేసి, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటపై వినియోగదారులకు మోజు పెంచుతున్నారు. ఇది వ్యసనంగా మారడంతో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటల నుంచి బయటకు రాని పరిస్థితిలో చాలామంది ఉంటున్నారు. ఏ సభ్యుడు రోజు ఎంత సేపు ఆడుతున్నాడనే విషయాన్ని గుర్తిస్తూ, ఆన్‌లైన్ సైట్ నిర్వాహకులు వారి దృష్టంతా ఆటపై ఉండేందుకు జిమ్మిక్కులు చేస్తుంటారు. మొదట రమ్మీ, ఇతర బెట్టింగ్ ఆటలు ఆడిన వారికి గెలిచేందుకు కొంత అవకాశమిస్తారు.. ఆ తరువాత వారికి ఆటను అలవాటు చేసి ఇక ఆశలో వారిని ముంచేస్తుంటారు. పది సార్లు పెట్టుబడి బడితే అందులో 8 సార్లు నష్టపోవడం, రెండు సార్లు లాభం వచ్చినట్లు చూపించే లాజిక్స్‌ను బ్యాకెండ్ నుంచి గ్యాంబ్లింగ్ ఆట నిర్వాహకులు చేస్తుంటారు. ఇలాంటి గ్యాంబ్లింగ్ ఆటపై గతంలో హైదరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. కలర్ ప్రిడిక్షన్ గేమ్‌ను గతంలో ఉక్కుపాదంతో అణిచివేశారు. ఈ గేమ్‌లో నష్టపోయిన వారు ఆత్మహత్మలు చేసుకుంటుండడంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా పోలీసులు స్పందించి మూలాల వరకు వెళ్లి ఆన్‌లైన్‌లో జరిగిన స్కామ్‌ను వెలుగులోకి తెచ్చి దేశ వ్యాప్తంగా నిర్వాహకులను పట్టుకున్నారు.

### మార్కెటింగ్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్స్..

పలు వ్యాపార సంస్థలు తమ వ్యాపారాభివృద్ధికి ఇన్‌ఫ్లూయెన్సర్స్‌తో ప్రకటనలు ఇప్పిస్తున్నాయి. సాధారణంగా వ్యాపార ప్రకటనలు ఇస్తే తక్కువ మొత్తంలోనే ఆదాయం ఉంటుంది. అదే నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను మార్కెటింగ్ చేస్తే భారీగా ఆదాయం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పలువురు ఇన్‌ఫ్లూయెన్సర్స్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు సంబంధించిన లింక్‌లు తమ సోషల్‌మీడియా ఖాతా ద్వారా తమ ఫాలోవర్స్‌కు చేరే విధంగా మార్కెటింగ్ చేస్తున్నారు. కొందరికీ లక్షల్లో వ్యూవర్స్ ఉంటున్నారు. అందులో కనీసం 10 శాతం మంది అయినా ఆ లింక్‌ను క్లిక్ చేయడంతో బెట్టింగ్ యాప్‌లకు భారీగానే ఆదాయం వస్తున్నది. అందులో కొందరు కమీషన్లు తీసుకుంటూ.. మరింతగా ప్రమోట్ చేస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్ ఇతర రాష్ట్రాలు, దేశాల వేదికగానే కొనసాగుతున్నాయి. బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్స్ ఇస్తూ కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు.

### సైబర్‌నేరాలకు తోడు ..

పెట్టుబడి, డిజిటల్ అరెస్ట్, పార్ట్‌టైమ్ జాబ్స్ ఇలా పలు రకాలైన సైబర్‌నేరాలు చేస్తున్న ప్రధాన సైబర్‌నేరగాళ్లు.. బెట్టింగ్ యాప్‌ల నిర్వాహణలోనూ సూత్రధారులుగా ఉంటున్నారు. ట్రై పోలీస్ కమిషనరేట్ పోలీసులు ఈ దిశగా విచారణ జరిపితే గ్యాంబ్లింగ్ గేమ్స్‌ను నిరోధించేందుకు అవకాశముంటున్నది.

## గ్రూప్ 2 పరీక్షకు 60% మంది గైర్హాజరు!

సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో గ్రూప్- 2 పరీక్షకు చాలా మంది గైర్హాజరయ్యారు. కేవలం 40 శాతం మంది మాత్రమే పరీక్ష రాశారు. గ్రూప్ -2 పరీక్షకు 48,012 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. ఆదివారం జరిగిన పరీక్షకు కేవలం 19,208 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. 28,804 మంది గైర్హాజరయ్యాని చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 101 పరీక్ష కేంద్రాల్లో కొన్నింటిని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 39.32 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారని చెప్పారు. కాగా, సోమవారం కూడా గ్రూప్- 2 పరీక్ష జరగనున్నది.



భూసేకరణ చేస్తున్న మెట్రో, రెవెన్యూ అధికారులు

## పరిహారం తర్వాతే కూల్చివేతలు

### ఓల్డ్ సిటీ మెట్రో భూసేకరణ పరిశీలించేలా ప్రణాళికలు

200 ఆస్తులకు పరిహారం చెల్లింపునకు ఏర్పాట్లు

మొత్తం 1100 ఆస్తుల భూసేకరణకు జిల్లా యంత్రాంగంతో మెట్రో కసరత్తు

సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఓల్డ్ సిటీ మెట్రో విషయంలో పరిహారం చెల్లించిన తర్వాతే కూల్చివేతలు మొదలవుతాయని మెట్రో హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడించారు. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట మార్గంలో భూసేకరణ పనులు ముమ్మరం చేశారు. ఏడున్నర కిలోమీటర్ల పొడువులో 1100 ప్రభావిత ఆస్తుల సేకరణకు కసరత్తు చేస్తుండగా, ఇప్పటివరకు 900 ఆస్తులకు సంబంధించిన రిక్విజేషన్‌ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. వాటిలో 800 ఆస్తులకు సంబంధించిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను పలు దఫాలుగా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. నోటిఫై చేసిన 400 ఆస్తులకు ప్రిలిమినరీ డిక్లరేషన్ పూర్తి చేయగా, 200 ప్రభావిత ఆస్తుల పరిహారానికి సంబంధించిన ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తవుతుందన్నారు. పరిహారం చెల్లించిన వెంటనే కూల్చివేతలు మొదలవుతాయన్నారు. ఈ మార్గంలో ఉన్న వివిధ నిర్మాణాలు, ప్రభావిత ఆస్తుల యజమానులతో చర్చించి, భూ సేకరణ చట్టం ప్రకారం సేకరించి, రోడ్డు విస్తరణ పనులు చేపడుతామన్నారు. చారిత్రక, మతపరమైన కట్టడాలను పరిరక్షించేలా ఇంజినీరింగ్ సొలుష్యన్లు అమలు చేశామన్నారు. మెట్రో రైల్ రాకతో ఓల్డ్ సిటీ రూపురేకలు మారిపోతాయని, పనుల పురోగతిని సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, భూ సేకరణ ప్రక్రియపై ఇటీవలే సమీక్షించినట్లు ఆయన తెలిపారు.

## వామ్మో.. చలిపులి



### రాజేంద్రనగర్ @11 డిగ్రీలు

సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువగా నమోదవుతుండడంతో గత రెండు మూడు రోజులుగా చలిపులి వణుకు పుట్టిస్తోంది. ముఖ్యంగా రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో సాయంత్రం నుంచే చలి మొదలై, రాత్రి, తెల్లవారుజాము వరకు వణుకు పుట్టిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలోని రాజేంద్రనగర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు అత్యల్పంగా 11.0 డిగ్రీలు, హకీంపేటలో 13. 7, నగరంలో 14.2 డిగీలుగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## ఆదాయ మార్గాలపై నిర్లక్ష్యమెందుకు?

రెవెన్యూ పెంచే ప్రాజెక్టులను పట్టించుకోని హెచ్ఎండీఏ

ప్రధాన ఈవెంట్ వేదికలకు ఆదరణ కరువు

వచ్చే15 రోజుల వరకు నో బుకింగ్స్

సిటీబ్యూరో: హెచ్ఎండీఏ ఆదాయ మార్గాలను మరిచింది.బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు పరిధిలోని సంజీవయ్య పార్క్, నెక్లెస్ రోడ్డు, లేక్ ఫ్రంట్ పార్క్, బోటింగ్, ఎన్టీఆర్ గార్డెన్, అంబేద్కర్ స్టాచ్యూ, లుంబినీ పార్క్, ట్యాంక్ బండ్ పరిసరాలన్నీ కూడా హెచ్ఎండీఏకు ఆదాయం తీసుకువచ్చే వేదికలే. కానీ గడిచిన ఏడాది కాలంగా ఈ ప్రాంతంలో జరిగే నిర్మాణ పనులు, మరమ్మతుల కారణంగా లీజింగ్ జరగడం లేదు. దీంతో ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. గతంలో సినిమా షూటింగ్‌లు, సమావేశాలు, గెట్ టు గెదర్ మీటింగ్‌లు, ఈవెంట్ల పేరిట ఎప్పుడూ బుకింగ్ నిండిపోయి ఉండేవి. కానీ ఇటీవల కాలంగా బీపీపీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బుకింగ్స్ రావడం లేదని తెలిసింది. ట్యాంక్ బండ్ పరిసరాల్లో ఏదైనా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఆన్‌లైన్‌లోనే అనుమతులు పొందే అవకాశాన్ని బీపీపీ ఏర్పాటు చేసింది. ఇందులో తేదీల వారీగా, ట్యాంక్ బండ్ నుంచి లేక్ ఫ్రంట్ పార్క్ వరకు అన్ని వేదికలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. కానీ వచ్చే 15 రోజుల వరకు ఏ ఒక్క వేదికలో కూడా బుకింగ్స్ జరగలేదని తేలింది. దీనికి ప్రధాన కారణం గతంలో కంటే అధ్వానంగా నిర్వహణ ఉండటంతోనేనని, వినియోగదారులకు అనువైన మౌలిక వసతులు లేకపోవడంతోనే బీపీపీ పరిధిలో ఉన్న ఈవెంట్ వేదికలకు ఆదరణ రావడం లేదని తెలుస్తున్నది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ట్యాంక్ బండ్‌పై కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలు ఉండగా... ఒక్కో కార్యక్రమానికి రూ. 10వేల నుంచి లక్ష వరకు చార్జీల రూపంలో హెచ్ఎండీఏకు వస్తుంది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అదనపు ఆదాయాన్ని హెచ్ఎండీఏ కోల్పోతున్నది. డిసెంబర్ 31 వరకు వేదికలన్నీ కూడా ఖాళీగానే ఉండగా... బుకింగ్స్‌ను ఆకర్షించడంలో అధిక ధరలు కూడా కారణమని, మరమ్మతుల పేరిట ఏటా టెండర్ల వ్యవహారం నడిపిస్తున్నారే తప్ప.. కనీస మౌలిక వసతులు ఆయా వేదికల్లో ఉండటం లేదని కొందరు గతంలో బుకింగ్ చేసుకున్న ఈవెంట్ ఆర్గనైజర్లు తెలిపారు. అంతకంటే తక్కువ ఖర్చుతో నగరంలో ఎన్నో వేదికలు అందుబాటులో ఉన్నాయంటున్నారు.









## దారులన్నీ ..ఇలా

'స్వచ్ఛ హైదరాబాద్' లక్ష్యం నీరుగారుతున్నది. నగరంలో ఎక్కడ చూసినా.. చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా రహదారుల పక్కన వ్యర్థాలు తొలగించకపోవడంతో వాహనదారులు, పాదచారులు దుర్వాసనతో అవస్థలుపడుతున్నారు.



## పూర్తయ్యేదెన్నడో..!

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సైదాబాద్- చంచల్‌గూడ బ్రిడ్జి పనులు ప్రస్తుత ప్రభుత్వంలో నత్తనడకన సాగుతున్నాయి. నిర్మాణ పనులు ఆలస్యమవుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు.